క్లుప్తంగా

విద్యుత్ శాఖ జేఈగా రమేష్

రోలుగుంట : విద్యుత్‌శాఖ మండల ఏఈగా విధులు నిర్వహించిన పద్మనాభం సాధారణ బదిలీల్లో భాగంగా గోపాలపట్నం రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏఈగా నవీన్‌కుమార్ విధుల్లో చేరి మెడికల్ లీవులో ఉన్నారు. మండలంలో విద్యుత్ సేవలకు అంతరాయం ఏర్పడకుండా జేఈగా పని చేస్తున్న ఒ.రమేష్‌కు ఆ శాఖ ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆరుతడి పంటలకు మేలు చేసిన వర్షం

మాడుగుల రూరల్ : అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షం వల్ల ఖరీఫ్ వరి పంటకు ఎటువంటి నష్టం వాటిల్లి లేదని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు శనివారం తెలిపారు. తుపాను హెచ్చరికలతో 90 శాతం మేర రైతులు వరి కోతలు చేపట్టలేదని, మిగిలిన పది శాతం అక్కడక్కడా వరి కోతలు జరిగాయని, అయితే తేలికపాటి వర్షం వల్ల తడిసిన పంటకు నష్టం లేదన్నారు. ఈ వర్షాలు ఆరుతడి పంటలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. వరి పంట కోసే సమయంలో మినుములు, పెసలు, ఇతర అపరాల విత్తనాలు చల్లుతారని, వాటికీ ఈ వర్షం మేలు చేస్తుందని అన్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు మండలంలో 12 మి.మీ వర్షపాతం నమోదు అయిందన్నారు.

ఆడపిల్లలను సంరక్షిద్దాం



అడ్వైజరీ కమిటీతో సమావేశమైన ఏవో సూర్యనారాయణ

నర్సీపట్నం : ఆడపిల్లల సంరక్షన, పీసీపీ ఎన్‌డీటీ చట్టం తదితరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని డివిజన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణ పేర్కొన్నారు. లింగ నిర్ధారణ జరగకుండా స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రతి రోజు పీసీపీ ఎన్‌డీటీ ఆన్‌లైన్ పోర్టర్‌లో అప్‌లోడ్ చేసే వైద్యాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో పీవో ఎస్‌సీడీ డాక్టర్ ప్రశాంతి, జిల్లా అదనపు వైద్యాధికారి జ్యోతి, డాక్టర్ లక్ష్మణరావు, లాయర్ చందు, ఐసీడీఎస్ సూజర్‌వైజర్ సత్యవతి పాల్గొన్నారు.

బ్యాంకు, వైద్య సేవలపై అవగాహన



బ్యాంకు సేవలు తెలుసుకుంటున్న విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం క్షేత్ర సందర్శనలో భాగంగా స్థానిక పీహెచ్‌సీతో పాటు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును సందర్శించారు. బ్యాంకులో అందించే సేవలు, లావాదేవీలపై సిబ్బంది అవగాహన కల్పించారు. అలాగే పీహెచ్‌సీలో రోగులకు అందించే వైద్య సేవలు, లభించే మందుల వివరాలను తెలియజేశారు. ఈ క్షేత్ర సందర్శనతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని పాఠశాల హెచ్‌ఎం బాబ్జీరావు అన్నారు.

పౌరులంతా తమ హక్కులు తెలుసుకోవాలి



వారాడలో సివిల్ రైట్స్‌డే సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యవతి

కె.కోటపాడు : సమాజంలో పౌరులంతా వారి హక్కులను పొందాలని తహసీల్దార్ భాగ్యవతి అన్నారు. వారాడ గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతు ప్రతి పౌరుడు హక్కులను వినియోగించుకోవాలని తెలిపారు. అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి నెలాఖరున సివిల్ రైట్స్‌డే కార్యక్రమం ద్వారా వారి హక్కులను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వెంకటరావు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, గోపి, సోషల్ వెల్ఫేర్ సమీకృత వసతిగృహాధికారి పి.గంగు నాయుడు, రమేష్, పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని పాల్గొన్నారు.



మండలంలో పలు గ్రామాల్లో జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షాలు పడే సమయంలో గాలులు వీచే సమయంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో పలు సందర్భాల్లో ట్రాన్స్‌ఫారంల వద్ద విద్యుదాఘాతానికి గురై మరణాలు సంభవించిన ఉదంతాలు ఉన్నాయి. వీటికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, లేదా సురక్షిత ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రోలుగుంట హనుమాన్ గుడి వద్ద బావి వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కరెంటు కాటేస్తుందేమో..!

- నివాసాల నడుమ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- తరుచూ ప్రమాదాలు
- రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంట హనుమాన్ దేవాలయం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనున్న బావి పక్కనే అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ బావిలో నీటిని వాడుక నీరుగా స్థానికులు వినియోగించుకుంటారు. ఆరేళ్ల క్రితం స్థానిక బండారు వీధికి చెందిన లాలం సత్యవతి నీళ్ల తోడే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆకస్మికంగా పడిన కొబ్బరిమట్ట సత్యవతికి తగిలి ఆ సమయంలో పవర్ ఉండడంతో విద్యుదాఘానికి గురై మరణించింది. కొండపాలెం గ్రామంలో కూడా మూడు వీధుల కూడలిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి 4,6,7 వార్డు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇళ్ల మధ్య ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న వైర్లతో స్థానికులు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన బంటు రాజబాబు అనే వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సుమారు మూడేళ్ల క్రితం షార్టు సర్క్యూట్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన కర్రి చిట్టిబాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు మేల్కొని ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ని దూరప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ప్రమాదాలపై ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



కొండపాలెం గ్రామంలో ఇళ్ల నడుమ ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ కంచె వేయాలి



రోలుగుంటలో బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ ఎత్తు పెంచాలి. అలాగే రక్షణ కంచె ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ మార్గంలో వచ్చేవారిని నియంత్రించే వీలుంటుంది. బావి వద్దకు వెళితే ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నెలకొంది. అధికారులు స్పందించాలి.

– శెట్టి శ్రీను, బండారు వీధి, రోలుగుంట

సమస్య పరిష్కరించాలి



ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దూర ప్రాంతానికి తరలించాలి. ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళ్లే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం ఉంది. వీధి లైట్లు పని చేయనప్పుడు, వర్షాలు పడే సమయంలో ఈ మార్గంలో భయపడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తుంది. అధికారులు సమస్య పరిష్కరించాలి.

– కర్రి వీరునాయుడు, కొండపాలెం

అనుమతి పొందాలి

ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినపుడు నివాసాలు లేవు. తరువాత గ్రామస్తులు ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. ఇపుడు ప్రమాదమని చెబితే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తొలగించే అవకాశం లేదు. షిఫ్టింగ్ చార్జి చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆమోదం పొందాలి

– రమేష్, సబ్ ఇంజినీర్, రోలుగుంట విద్యుత్ కార్యాలయం

ఉప్పునీరు పిచికారీ చేయాలి



వరి రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయాధికారులు

చోడవరం రూరల్ : కోసిన వరిపనలు వర్షపునీటిలో తడిసినపుడు వాటిపై ఉప్పు నీటిని పిచికారీ చేసి కాపాడుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు ఖరీఫ్ వరి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు డి.ఉమామహేశ్వరరావు, ఆదిలక్ష్మి, చంద్రశేఖర్‌రావు తడిసిన వరిపంటలను పరిశీలించారు. రైతులు దిగులు చెందకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా కాపాడవచ్చని తెలిపారు. చోడవరం డివిజన్ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్, మండల వ్యవసాయాధికారి పావని, వ్యవసాయ విస్తరణాధికారులు కిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పారాహుషార్



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

చోడవరం రూరల్ : చేతిలో టచ్ ఫోన్ ఉంది కదా! అని వచ్చిన ప్రతి మెసేజ్‌ను టచ్ చేస్తే బ్యాంకులో ఉన్న బేలన్స్ మొత్తం ఖాళీ కావడం ఖాయమని భారతీయ స్టేట్ బ్యాంకు చోడవరం శాఖ మేనేజర్ ఎస్.ఎన్.రావు హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి ఆండ్రాయిడ్ ఫోన్లు కలిగి ఉంటున్నందున అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా బ్యాంకు అకౌంట్‌ను కలిగి ఉంటున్నందున సైబర్ నేరగాళ్లు విజృంభిస్తున్నారన్నారు. సదస్సును ప్రారంభించిన ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో నేడు సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోయిందని, వీటిని నివారించాలంటే అప్రమత్తతే మార్గమన్నారు. స్టేట్ బ్యాంకు అకౌంట్స్ మేనేజర్ ప్రియాంక మాట్లాడుతూ ఖాతాదారుల పిన్ నంబర్, ఓటీపీ నెంబర్లను ఏ బ్యాంకు కోరదని, అలా అడిగినట్టయితే తక్షణం మేల్కొనాలన్నారు. అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, ఉపన్యాసకులు వి.అప్పలనాయుడు, ఎస్‌ఎం రఫీయుద్దీన్, సుధీర్, మల్లిబాబు, సరస్వతి, రామలక్ష్మి, కృష్ణారావు, నారాయణమూర్తి, పీడీ మూర్తి పాల్గొన్నారు.

స్పీకర్‌కు 104 సిబ్బంది వినతి



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

మాడుగుల రూరల్ : 104 సంచార వాహనంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు నర్సీపట్నంలో శనివారం 104 సిబ్బంది వినతిపత్రం అందజేశారు. 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగసాయి, ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించాలని, 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు జి.వో. 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



లబ్ధిదారునికి పింఛన్ నగదు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సంజీవపురంలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

నర్సీపట్నం : ప్రభుత్వ చేపట్టిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గొలుగొండ మండలం, ఏటిగైరంపేటలో పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వచ్చే ఏడాది నుంచి చెరువులు, వాటి నుంచి పొలాలకు నీరు వెళ్లే కాలువలను పక్కాగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

స్మశానాల అభివృద్ధికి చర్యలు

నియోజకవర్గంలోని అన్ని స్మశానాలను పార్కుల్లా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. దీనిలో భాగంగా నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం స్మశానాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బలిఘట్టం శ్మశానం అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించేందుకు సీఎంఆర్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. మిగిలిన ఐదింటిని పార్కుల్లా మార్చేందుకు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిధులు సమకూరుస్తున్నట్టు తెలిపారు.

కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు

దేవరాపల్లి : డిసెంబర్ నుంచి కొత్త ఫించన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి అన్నారు. ఎ.కొత్తపల్లి శివారు సంజీవపురంలో పలువురు లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా ఫించన్ సొమ్మును అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన వారందరికీ డిసెంబర్ నెలలో కొత్త ఫించన్లు, జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డీఎల్‌డీవో మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పి.వి.జి.కుమార్, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పాత్రునాయుడు, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.



పాతవలసలో లబ్ధిదారులకు ఫించన్ నగదు అందించే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు : మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో శనివారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని అధికారులు నిర్వహించారు. పాతవలసలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి పరిశీలించారు. ఎంపీడీవో సాంబశివరావు, సూపరింటెండెంట్ అప్పలరాజు, సర్పంచ్ జామి శ్రావణ్ పాల్గొన్నారు.

సర్వర్లు పనిచేయక ఇబ్బందులు

మాడుగుల రూరల్ : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పంపిణీ చేశారు. వర్షం వల్ల గ్రామాల్లో సర్వర్ పనిచెయ్యక పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో కింతలి గ్రామంలో సర్పంచ్ భవానీ, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం పింఛన్లు తీసుకోని వారు వచ్చే 2వ తేదీన తీసుకోవాలని, లేదా వచ్చే నెలలో అయినా తీసుకోవచ్చునని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు.

ముంచుకొచ్చిన ఫెంగల్

- తప్పని పరిస్థితిలో వరి కోతలు
- 2వేల ఎకరాల్లో తడిచిముద్దయిన పంట

మాడుగుల : తుపాను కారణంగా నియోజకవర్గంలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా వరి చేలు తడిచి ముద్దయినట్టు రైతులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది 70 వేల ఎకరాల్లో పంట వేశారు. మరో వారం రోజుల్లో వరి కోతలు చేపట్టనుండగా వరి రెక్క రాల్చు పురుగు బెడద ఎదురైంది. దీంతో తుపాను హెచ్చరికలు ఉన్నా గింజలన్నీ నేలమట్టం అవుతున్నాయని రైతులు రెండు రోజుల ముందుగానే వరి కోతలకు దిగారు. చేలు ఆరక ముందే తుపాను రావడంతో చేలన్నీ పొలాల్లోనే తడిచి ముద్దవుతున్నాయి. కొంత మంది రైతులు పొలాల్లో నేల రాలిన ధాన్యం ఏరుతున్నారు. యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యం పొలాల్లోనే రాశులు వేయడంతో తడిచిన ధాన్యం రంగుమారుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



మాడుగుల మండలం సత్యవరంలో తడిచిన వరి చేలు ఒడ్డుకు చేర్చుతున్న రైతు

మాకవరపాలెం : మండలంలో ఈ ఖరీఫ్‌లో 1410 హెక్టార్లలో రైతులు వరిపంట సాగు చేశారు. అయితే శుక్రవారం రాత్రి నుంచి తుపాను ప్రభావంతో కురిసిన వర్షం, ఈదురుగాలులకు కొండలఅగ్రహారం, పి.పి.అగ్రహారం, మాకవరపాలెం, జంగాలపల్లి, తదితర ప్రాంతాల్లో వరిపంట నేల వాలింది. మండలంలో శుక్రవారం రాత్రి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 12 మి.మీ, అనంతరం సాయంత్రం వరకు 11.6 మి.మీ వర్షపాతం నమోదైంది. నేలవాలిన పంటను రక్షించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

కె.కోటపాడు : తుపాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ మండల గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే వరి కోతలు పూర్తి చేసిన పంటను రైతులు కల్లాలకు తరలించగా, మరి కొందరు పొలాల్లోనే చిన్నపాటి బడెవులుగా వరిపంటను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు వరికోతలు వాయిదా వేసుకున్నారు. వర్షంతో పొల్లాలో చేరిన నీరు బయటకు పోయేలా కాలువలు ఏర్పాటు చేసుకున్నారు.



ఆర్.భీమవరంలో నేలకొరిగిన వరి పంట

రోలుగుంట : తుపాను కారణంగా పలు గ్రామాల్లో బాగా పండి కోతకు సిద్ధంగా ఉన్న వరిచేను నేలకొరిగింది. శనివారం వేకువ జాము నుంచి మండలంలో గల అన్ని గ్రామాల్లో చిరుజల్లులు కొనసాగుతున్నాయి. మండల వ్యవసాయాధికారి ఎస్.వి జయలక్ష్మి రైతుల పొలాలను సిబ్బందితో కలిసి సందర్శించి పరిశీలించారు పంట భూముల నుంచి నీరు బయటకు పంపేలా చూడాలన్నారు.

బుచ్చెయ్యపేట : శుక్రవారం రాత్రి నుండి గాలి వర్షం కురవడంతో ఆర్.భీమవరం, రాజాం, నీలకంఠాపురం, బుచ్చెయ్యపేట, వడ్డాది, చినఅప్పనపాలెం, విజయరామరాజుపేట, పోలేపల్లి తదితర గ్రామాల్లో కోతకొచ్చిన వరి పంట నేలకొరిగిపోగా పలువురి రైతులు కోసిన వరి పనలు తడిచిపోయాయి. పొలాల్లోకి వర్షం నీరు చేరకుండా రైతులు పొలం గట్లు తవ్వి కాలువలు చేస్తున్నారు. తడిచిన వరి పనలపై ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు నీరు స్ప్రేయింగ్ చేయాలని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు రైతులకు సూచించారు.

చీడికాడ : అల్పపీడన ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి స్వల్పంగా కురిసిన వర్షానికి స్వల్పంగా వరి పంట తడిసింది. గురు, శుక్ర, వారాల్లో కోసిన వరి పంట శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం ఆడపా, దడపా కురిసిన వర్షానికి స్వల్పంగా పలు గ్రామాల్లో వరి పంట తడిసింది.



గుల్లేపల్లిలో మడిలో వర్షం నీరు బయటకు వెళ్లేలా తీసిన కాలిబాటలు



వడ్డాది వంతెనపై చేరిన వర్షం నీరు

91 శాతం పింఛన్ల పంపిణీ



వొమ్మలి జగన్నాథపురంలో పింఛన్ల పంపిణీ పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల : మండలంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ 91 శాతం పూర్తయిందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలో వివిధ పింఛన్లు 11,650 కాగా తొలిరోజు 10,658 పంఛన్ల పంపిణీ జరిగిందన్నారు. సచివాలయం సిబ్బంది తక్కువగా ఉన్న చోట, అంగన్‌వాడీ వర్కర్లతో కూడా పింఛన్ల పంపిణీ చేశామన్నారు.

నాడు నీరు లేక.. నేడు వరదై



వరి చేను కుప్పలు వేయిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

నాతవరం : తాండవ ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వరి రైతులు నాడు నీటి కోసం ఇబ్బంది పడగా, నేడు తుపాను కారణంగా నీరు వరదై అయోమయంలో ఉన్నారు. ఈ ఏడాది తాండవ ప్రాజక్టులో నీరు పుష్కలంగా ఉన్నా కాలువలో పూడిక తొలగించక శివారు ఆయకట్టు పొలాలకు నీరు అందలేదు. ఇపుడు చేతికి అందివచ్చిన సమయంలో తుపాను రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. మండలంలో 32వేలకు పైగా వరి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 25 వేల ఎకరాలకు పైగా వరి చేను కోత దశలో ఉంది. పండిన పంటను కోయకపోతే ధాన్యం పొలంలోనే రాలిపోతాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తుపాను ప్రభావం తగ్గే వరకూ వరి కోతలు కోయవద్దని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

తెలుగు ఉపన్యాసకుడికి అభినందన



ప్రసంగిస్తున్న ఉపన్యాసకుడు పైడిరాజు

మాడుగుల/మాడుగుల రూరల్ : యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ అండ్ లిటరేచర్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ఈ నెల 29 , 30 తేదీలోల నిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు ఉపన్యాసకుడు పులపర్తి పైడిరాజు ఆంధ్ర మహాభారతంలోని విజ్ఞానాంశాలపై ప్రతిభ కనబరిచి పత్ర సమర్పణ చేశారు. దీంతో స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి, ఉపాన్యాసకులు, ఎంపీపీ వెంకటరాజారామ్, మోదకొండమ్మ కమిటీ మెంబరు శ్రీనాదు శ్రీనివాసరావు, విద్యార్థులు శనివారం అభినందించారు.

పాలకేంద్రాల వద్ద నిరసన



కొరువాడలో రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుడు ముత్యాలనాయుడు

కె.కోటపాడు : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల ధరను రైతులకు రూ.50లుగా ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాల వద్ద శనివారం పాడి రైతులతో కలసి ఆవుపాల ధరను తగ్గించినందుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాణా ధరను కూడా తగ్గించాలని కోరారు. పక్క రాష్ట్రాలలో పాల రైతులకు ప్రోత్సాహంగా లీటర్‌కు రూ.5లను రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నాయని అదే విధంగా ప్రభుత్వం రైతులకు మన రాష్ట్రంలో కూడా చెల్లించాలని కోరారు. డిమాండ్ల సాధనకు డిసెంబర్ 2న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పెనగంటి నాయుడు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి



కరపత్రాలు అందజేస్తున్న మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు రామకొండలరావు

మాడుగుల రూరల్ : వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆయన స్థానిక వీహెచ్‌పీ గ్రామ శాఖ కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ కోసం ఈ హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల ప్రఖండ కర్రి వరహాలురాజు, కె.జె.పురం గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథరావు, బి.జగ్గారావు, పరిమి కాసుల జగ్గారావు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించి ఆదివారం సాయంత్రం 4 గంటలకు కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు రామకొండలరావు తెలిపారు.